సాక్షి
కుమురం భీం
సోమవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2023



వీక్షించి.. బంధించి
కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో బర్డ్‌వాక్ ముగిసింది. పక్షులు కిలకిల రాగాల మధ్య గడిపిన క్షణాలను మరిచిపోలేమని పర్యాటకులు చెబుతున్నారు. 8లో▸



రవాణా భత్యం.. అందని దైన్యం
రెండేళ్లుగా పాఠశాల విద్యార్థులకు రవాణా భత్యం అందడం లేదు. దీంతో దూరప్రాంతాల్లోని స్కూళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.5 /17.2

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువ అనిపిస్తుంది. గాలిలో తేమ పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేడు జైనూర్‌లో మెగా వైద్యశిబిరం
ఆసిఫాబాద్‌రూరల్: జైనూర్ మండల కేంద్రంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 12 మంది వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9, 10 తేదీల్లో తపాలాశాఖ ప్రత్యేక మేళా
కాగజ్‌నగర్‌టౌన్: ఆడపిల్లల బంగారు భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం సుకన్య సమృద్ధి యోజనను ప్రారంభించిందని కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న అమృత్ పెక్స్‌– 2023 ప్రోగ్రాంలో ఈ నెల 9, 10వ తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిచేందుకు తపాలా శాఖ ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రూ.వెయ్యితో ఖాతా తెరవాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.250 మాత్రమేనని, పదేళ్లలోపు వయస్సు గల బాలికలు ఈ ఖాతాను ప్రారంభించడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెమిస్టర్ పరీక్షలకు హాజరుకావాలి
కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2017, 2018, 2019, 2020, 2021 పాత బ్యాచ్ సైన్స్ డిగ్రీ విద్యార్థులకు ప్రథమ సంవత్సరం సెమిస్టర్‌– 2, డిగ్రీ ద్వితీయ సంవత్సరం సెమిస్టర్‌– 4 బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ తూడురు దత్తాత్రేయ తెలిపారు. ఈ నెల 4 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయని, ఫీజు చెల్లించిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98663 98678, 94943 14314 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ రాహుల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్ హాజరై పోటీలను ప్రారంభించారు. విజేతలుగా మధుకుమార్, భీమ్‌రావు, రన్నర్స్‌గా తాజ్, సాయి నిలిచారు. వీరికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వచ్చేనెల గోవాలో జరిగే జాతీయస్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ 70 ప్లస్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుడు పల్లెం రాజలింగును సన్మానించారు. బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, పీఈటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండ మీనారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

జాతరకు పకడ్బందీగా బందోబస్తు



సూచనలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఎస్పీ సురేశ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీకి స్వాగతం పలికి స్వామి వారి చిత్రపటం బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మూడు రోజుల పాటు పకడ్బందీగా బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేల సంఖ్యలో భక్తులు వస్తుండడంతో డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, 58 మంది ఏఎస్సైలు, 36 మంది కానిస్టేబుళ్లు, 41 మంది హోంగార్డులతో పాటు 192 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్‌కు ప్రత్యేక దారులు ఏర్పాటు చేశామన్నారు. నిఘా కోసం 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

గంపెడాశలు..!



నిర్మాణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి భవనం

- పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం
- పల్లె రోడ్లకు మరిన్ని నిధులు అవసరం
- ప్రారంభం కాని మెడికల్ కాలేజీ, వార్ధా బ్యారేజీ పనులు
- నిధుల మంజూరుపై గిరిజనుల ఆశలు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, ఆసిఫాబాద్: రాష్ట్ర బడ్జెట్‌పై కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తే పనులు జోరందుకుంటాయని ఆశిస్తున్నారు. రోడ్ల మరమ్మతులకు తగిన నిధులు కేటాయించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

వంతెనల నిర్మాణం..
జిల్లాలో చాలా వంతెనలు నిర్మాణ దశలోనే ఉండిపోయాయి. కొన్నింటి పనులు నత్తను మరిపిస్తుండగా.. మరికొన్ని పనులే మొదలుకాలేదు. గుండి వంతెన 15 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఉమ్రి వంతెన, ఎర్రవాగులపై వంతెన పనులు అంతే.

రోడ్లు మెరుగుపడాలి
జిల్లాలో 432 గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేదు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి లింక్ రోడ్లు లేవు. గతేడాది వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు అటకెక్కాయి. వీటి కోసం గతంలో అధికారులు రూ.57 కోట్లతో అంచనాలు రూపొందించగా.. ప్రభుత్వం కేవలం రూ.25 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. తిర్యాణి, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్, గాదిగూడ, ఆసిఫాబాద్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ సగానికి పైగా గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం లేదు. అత్యవసర సమయంలో రాకపోకలు సాగించడానికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మారుమూల గూడేల్లోని ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. తిర్యాణి మండలంలోని ఎక్కువగా గ్రామాలు రిజర్వు ఫారెస్టుకి దగ్గర ఉండటంతో నిధులు మంజూరైనా ఫారెస్ట్ క్లియరెన్స్ లభించడం లేదు.. మొత్తంగా వీటి పనులకు రూ.300– 350 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కాలేజీని ప్రకటించింది. భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చివరి ఆయకట్టు వరకు నీరందించాలని, రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆశిస్తున్నారు. ఇలా ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా ప్రజలపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కరుణిస్తారా? మొండి చేయి చూపిస్తారా? అన్నది చూడాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులు..

జగన్నాథపూర్ ప్రాజెక్టు



పదిహేను వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాల్సిన మధ్య తరహా ప్రాజెక్టు ఇది. నిర్మాణం పూర్తి చేయాల్సి గడువు ముగిసి 18 ఏళ్లు దాటింది. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకూ నీరందలేదు. కాగజ్‌నగర్ మండం జగన్నాథపూర్ వద్ద పెద్దవాగుపై ఈ ప్రాజెక్టును 2005లో అప్పటి ముఖ్యమంతి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా చేపట్టింది. అప్పట్లో కేంద్ర నిధులు జాప్యం లేకుండా విడుదలయ్యాయి. ఇప్పటికీ హెడ్‌వర్క్స్ పూర్తి కాలేదు. ప్రధాన కాలువ తవ్వకం పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కాలువలపై నిర్మించాల్సిన 482 స్ట్రక్చర్లలో ఒక్కటి కూడా ప్రారంభం లేదు. హెడ్‌వర్క్‌కు ఇంకా ఏడు ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

కుమురం భీం ప్రాజెక్టు
పది టీఎంసీల సామర్థ్యంతో కుమురంభీం ప్రాజెక్టును పదేళ్ల కిందట నిర్మించారు. నిధులు లేక కాల్వలు నిర్మించలేదు. 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉండగా ఎక్కడా కూడా సక్రమంగా నీరివ్వలేదని స్థానికులు వాపోతున్నారు. కుడి కాలువ లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో పూడుకుపోయాయి. డిస్ట్రిబ్యూటరీల కోసం భూసేకరణ చేపట్టాల్సి ఉంది

- ఈ రెండు ప్రాజెక్టుల కోసం కనీసం రూ.300 కోట్ల నిధులు విడుదల చేస్తే కానీ పనులు జరి గే పరిస్థితి లేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కే టాయిస్తారనే జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. మి షన్ కాకతీయ ఫేజ్‌– 3, 4 బిల్లులు రాలేదు. దాదాపు రూ.45 కోట్లు పెండింగ్‌లోనే ఉంచారు.
- కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహిత నదిపై చేపట్టిన ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు పనులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మరణానంతరం నిలిచిపోయాయి. 'ప్రాణహిత'కు బదులుగా వార్ధా నదిపై బ్యారేజీ నిర్మాణం కోసం సర్వే చేసినా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనికి నిధులు కేటాయించాల్సి ఉంది.

మద్దతు కోసం పోరాటం

రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పత్తికి ఆశించిన ధర లేక రైతులు పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలని జిల్లా రైతులు పోరాటానికి ఏకమవుతున్నారు. అందులో భాగంగా నేడు జిల్లా వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు.

- పతనమవుతున్న పత్తి ధర
- ఇళ్లల్లోనే నిల్వ చేయడంతో ప్రమాదాలు
- మద్దతు ధర పెంచాలని రైతుల డిమాండ్
- నేడు జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిన రైతు సంఘాలు



కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లిలో అగ్నిప్రమాదంలో దగ్ధమైన పత్తి (ఫైల్)

కౌటాల(సిర్పూర్): పత్తి రైతులకు ధర బెంగ పట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాకు రూ.6,300గా మద్దతు ధర నిర్ణయించింది. సీజన్ మొదట్లో జిల్లాలోని మార్కెట్లలో రూ.9వేల పైచిలుకు ధర పలికింది. ఇది సుమారు 25 రోజుల పాటు కొనసాగింది. ఆ సమయంలో రైతులు పత్తితీత పనులు ప్రారంభమే కాలేదు. ఆ తర్వాత నుంచి ధర తగ్గుతుండటంతో రైతులు ఇళ్లల్లోనే పంటను నిల్వ చేసుకుంటున్నారు. రేటు పెరుగుతుందన్న ఆశతో నెలల తరబడి విక్రయించకుండా ఎదురు చూస్తున్నారు. అయితే రోజురోజుకూ ధర పడిపోతుండడంతో రైతుల ఆశలు నీరుగారుతున్నాయి.

ధరలో హెచ్చుతగ్గులు..
జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో క్వింటాకు రూ.9వేలకు పైగా ఉండగా.. డిసెంబర్ మధ్యలో అమాంతం పడిపోయింది. రూ.7,200 నుంచి రూ.7,300 మధ్య పలికింది. ఇదీ 15 రోజుల పాటు కొనసాగింది. సంక్రాంతి తర్వాత ధర రూ.7,050– రూ.7,616 మధ్య ఉంది. జిన్నింగ్ మిల్లుల నుంచి డిమాండ్ లేనందున రెండు నెలల క్రితంతో పోలిస్తే ధర తగ్గుతున్నట్లు సమాచారం. జిల్లాలో ప్రస్తుతం పత్తి ధర రూ.7,500 ఉంది. ఇంకా పెరుగుతుందేమోనన్న ఆశతో కర్షకులు పంటను విక్రయించడం లేదు. 60 శాతానికి పైగా పంట రైతుల ఇళ్లలోనే ఉందని అంచనా. ఇప్పుడున్న ధరలతో పత్తిని విక్రయిస్తే పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందుల్లో కౌలు రైతులు
ధర పెరగకపోవడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలు డబ్బులు, విత్తనాలు, ఎరువులు, మందులు, డీజిల్ ధరలు పెరగడంతో పెట్టుబడి ఎక్కువై అప్పులు భారంగా మారాయి. చేతికి వచ్చిన పంటను అమ్ముకుని భారాన్ని తగ్గించుకుందామనుకుంటే రోజురోజుకూ ధరలు పడిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పత్తి ఇళ్లలోనే నిల్వ ఉంచుతుండడంతో అగ్ని ప్రమాదాలతో పంట దగ్ధమవుతున్న ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. ఇదే అదనుగా దళారులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కొనుగోళ్లు చేపడుతున్నారు. క్వింటాకు కిలో కటింగ్ చేసి రాత్రికిరాత్రే ప్రైవేట్ మార్కెట్లకు తరలిస్తున్నారు.

నేడు జిల్లా బంద్..
పత్తి ధరకు ధర పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని రైతు సంఘాలు జిల్లా బంద్‌కు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. రూ.15 వేలు మద్దతు ధర చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించాలని కోరారు. అంతర్జాతీయంగా ప్రామాణికంగానే పత్తి ధరలు ఉంటాయని, కాటన్ ఆయిల్ వినియోగం ఇతర దేశాల్లో తగ్గడంతోనే పత్తి ధరలు పెరగడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

పోరాటాల ఫలితంగానే వేతనాల పెంపు



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెరిగాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. జిల్లా అధ్యక్షురాలు శారద అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్‌లో విజయోత్సవ సభ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి వేతనాలను రూ.1000 నుంచి రూ.3 వేలకు పెంచుతూ శనివారం జీవో విడుదల చేయడం హర్షనీయమన్నారు. ఈ జీవోను గతేడాది మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుంచి అమలు చేస్తూ ఏరి యర్స్‌తో సహా చెల్లించాలని కోరారు.



అట్టహాసంగా రథోత్సవం



రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరకు రెండోరోజూ భక్తులు పోటెత్తారు. ఆదివారం నిర్వహించిన స్వామి వారి రథోత్సవం అట్టహాసంగా సాగింది. వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచిన రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వాగు పరిసరాలు సందడిగా మారాయి. ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎస్పీ సురేశ్‌కుమార్ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు.

– రెబ్బెన(ఆసిఫాబాద్)



'మధ్యాహ్న' కార్మికులకు ఊరట

- వేతనాలు పెంచుతూ జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.1000 నుంచి రూ.3వేలకు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎండీఎం కార్మికులు
- గతేడాది మార్చి నుంచి అమలు చేయాలని డిమాండ్



ఆసిఫాబాద్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కార్మికులు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో వి ద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతు న్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొన్నేళ్లుగా జీతాలు పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం రూ.వెయ్యిగా ఉన్న వేతనాలను రూ.3వేలకు పెంచుతూ ఈ నెల 4న జీవో నంబర్ 8 జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1,650 మంది కార్మికులు..
జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో మొ త్తం 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలలు 168, ప్రాథమి కోన్నత పాఠశాలలు 186, ప్రాథమిక పాఠశాలలు 909 ఉన్నాయి. ఇందులో లోకల్ బాడీ పాఠశాలలు 747 ఉండగా, 1,650 మంది కార్మికులు నిత్యం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నారు. 2006లో పీఎం పోషణ్ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కార్మికుల ను నియమించింది. అప్పట్లో వారికి నెలకు రూ.1000 గౌరవ వేతనం అందించింది. అప్పటి నుంచి 16 ఏళ్లు గడిచినా జీతాలు పెరగకపోవడంతో కార్మికులు ఆందోళన బాట పట్టా రు. పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నామని వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆందోళనల ఫలితంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఎండీఎం కార్మికుల వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇటీవలే మెనూ రేట్లు పెంపు
నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో గత నెలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి రేట్లు సైతం రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గతంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 చెల్లించగా, ప్రస్తుతం దానిని రూ.5.46లకు పెంచారు. అలాగే ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.7.45 నుంచి రూ.8.47, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ.9.95 నుంచి రూ.10.67లకు పెంచారు. ధరలు, వేతనాల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందనుంది.

అమలు సందిగ్ధం..
పెంచిన వేతనాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారనే దానిపై ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. దీంతో కార్మికుల్లో సందిగ్ధం నెలకొంది. జీవోలకే పరిమితం కాకుండా వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు కోరుతున్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో వేతనాలు పెంచుతామని ప్రకటించిన గత మార్చి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను సంప్రదించగా ఇప్పటివరకు అధికారికంగా ఆదేశాలు రాలేదని, జీవోలో పొందుపర్చిన ఆదేశాల మేరకు జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులలకు అమలు చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ.3వేలకు పెంచుతూ జీవో జారీ చేయడం హర్షనీయం. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. కుటుంబ పోషణకు కూడా ఇబ్బందవుతోంది. ప్రభుత్వ నిర్ణయం మాకు కొంత మేలు చేస్తుంది.

– కమలాబాయి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

గత మార్చి నుంచి అమలు చేయాలి



ముఖ్యమంత్రి కేసీఆర్ గత మార్చి అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతామని ప్రకటించారు. మార్చి నుంచే పెంచిన వేతనాలు అమలు చేయాలి.

– సత్యనారాయణ, ఎండీఎం సంఘం జిల్లా అధ్యక్షుడు(ఏఐటీయూసీ)

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



గంజాయితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు


మందమర్రిరూరల్: మందమర్రి టోల్ ప్లాజా సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టగా 1.25 కేజీల గంజాయి పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అశోక్ వివరాల ప్రకారం... టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వారిని విచారణ నిమిత్తం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితులలో ఒకరు మైనర్ ఉన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్ప డిన సంఘటన పట్టణంలోని కౌసర్‌నగర్‌కాలనీలో ఆదివా రం చోటుచేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం ... సమ్‌రీన్ ఫాతిమా (24) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కడుపు నొప్పి తట్టుకోలేక ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫసి స్థానికంగా లేడీస్ టైలర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి పాప, బాబు ఉన్నాడు. మృతురాలి సోదరుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గోల్డెన్ ఓరియోల్(వంగపండు పిట్ట)



వైట్ వాగ్‌టెల్

పక్షిని కేమరాలో బంధిస్తున్న జేఎన్‌ఏఎఫ్‌ఏయూ స్టూడెంట్

వీక్షించి.. బంధించి

- కెమెరాలలో భద్రపరచి..
- రెండోరోజు ముగిసిన బర్డ్‌వాక్
- అడవిలోనే బసచేసిన పక్షి ప్రేమికులు

జన్నారం: పక్షులు కిలకిల రాగాలు పలికే... పక్షి మురిసిన క్షణాలు ఎన్నటికీ మరువలేనివని అంటున్నారు పక్షి ప్రేమికులు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో బర్డ్‌వాక్ రెండో రోజు కొనసాగింది. రెండు రోజుల బర్డ్‌వాక్ ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి జన్నారం డివిజన్‌లోని కామన్‌పల్లి వాచ్ టవర్, ఘనిషెట్టి కుంటలలో డేరాలు ఏర్పాటు చేశారు. వీటిలో పక్షి ప్రేమికులు బస చేశారు. తెల్లవారు ఆరు గంటలకు కల్పకుంటకు వెళ్లి పక్షుల కిలకిలల మధ్య ఆనందంగా పక్షులను కెమెరాలలో బంధించారు. అక్కడి నుంచి మైసమ్మ కుంటలో గంటపాటు పక్షులను కెమెరాలలో బంధించారు. వెదురు వంతెన, గడ్డి క్షేత్రాలను పరిశీలించి అక్కడి నుంచి ఘనిషెట్టి కుంటలో అల్పాహారం చేసి, తిరిగి అటవీశాఖ గెస్ట్ హౌజ్‌కు వెళ్లారు. అక్కడ వారి అనుభవాలను అటవీశాఖ అధికారులతో పంచుకున్నారు.



పక్షుల ఫొటోలు తీస్తున్న బర్డ్‌వాచర్లు



శాండీపైపర్

ఆనందంగా ఉంది



బర్డ్‌వాక్ ఉందని తెలియగానే ఇక్కడికి వచ్చాను. పేరు నమోదు చేయించుకున్న వారికి అటవీశాఖ వసతులు కల్పించింది. కామన్‌పల్లి వాచ్‌టవర్ వద్ద అటవీశాఖ అధికారులు డేరాలను ఏర్పాటు చేశారు. అర్ధ రాత్రి వరకు ఫైర్‌క్యాంప్ పెట్టుకుని డేరాలలో బస చేశాము. తెల్లవారు జామునే కల్పకుంటలో పక్షులను గమనించాము. ఇలాంటి చోటుకు రావడం ఆనందంగా ఉంది.

– ఇర్షాద్, చార్టర్డ్ అకౌంటెంట్, హైదరాబాద్

160 రకాల పక్షులను గుర్తించాం



మా పాఠశాల తరుపున ఇక్కడికి వచ్చాము. పక్షులపై మా పాఠశాలలో అవగాహన కల్పించారు. 300 రకాల పక్షుల గురించి తెలుసుకున్నాను. ఇక్కడ రెండు రోజులుగా పక్షులను గమనించాము. 160 రకాల పక్షులను గుర్తించాము. వీటి పేర్లను కూడా చెప్పగలను. రెండు రోజుల పర్యటన అద్భుతంగా ఉంది.

– దీపిక, 9వ తరగతి విద్యార్థిని, కామారెడ్డి

చాల రకాల పక్షులను గమనించాం



బర్డ్‌వాక్‌లో భాగంగా ఇక్కడికి వచ్చాము. ఇప్పటి వరకు రెండు సార్లు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నాను. అరుదైన పక్షి జాతులు ఇక్కడ గమనించాము. శీతాకాలంలో రకరకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు. ఐరోపా, ఆసియా ఖండాలలో ఉండే పక్షులను ఇక్కడ చూశాం. బర్డ్‌వాక్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– కిశోర్, హైదరాబాద్

టీజీఎల్ బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా చాంద్‌పాషా



చాంద్‌పాషా

బెల్లంపల్లి: తెలంగాణ గోదా వరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (టీఎల్‌జీబీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన ఎండి చాంద్‌పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రాష్ట్ర 11వ మహాసభలు నిర్వహించారు. ఆ సభలో చాంద్‌పాషాను వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు నీల్వాయి విద్యార్థి



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ



హర్షిన్‌బాను

వేమనపల్లి: నీల్వాయిలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎండి హర్షిన్‌బాను జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబశివరావు, పీఈటీ మల్లేష్ తెలిపారు. ఆమె మంచిర్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబర్చింది. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొననుంది. క్రీడాకారిణి ప్రయాణ ఖర్చుల కోసం జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచ్ గాలి మధు నగదు అందజేసి అభినందించారు.

గూడెంలో పౌర్ణమి జాతర



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు..



సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముతున్న దంపతులు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం..

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 310 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి. జాతరకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నిత్యహోమాలు, శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి, బలిహరణము, స్వామివారి సేవా ఉత్సవము కార్యక్రమాలు నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖానాపూర్: ఎస్సీవర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగ, మాదిగ ఉపకులాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈ నెల 11న ఆదిలాబాద్‌లోని జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్, రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్, ఆదిలాబాద్ కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్, మంచిర్యాల కన్వీనర్ చెన్నూర్ సమ్మయ్య, కుమురంభీం జిల్లా కన్వీనర్ బ్రహ్మయ్య, నాయకులు అశోక్, శరత్‌కుమార్, కుడాల స్వామి, నంద కుమార్, తుకారాం, బర్ల రాజ్‌కుమార్, సుందిల్ల మల్లేశ్, బైర మధు, కాంబ్లే బాలాజీ, నాగరాజు, గణేశ్, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.

కోతుల దాడిలో యువకుడికి గాయాలు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏ రియా అరుణక్కనగర్‌కు చెందిన శ్రీనివాస్ కో తుల దాడిలో గాయపడ్డాడు. శ్రీనివాస్ ఇంటిలో పని చేసుకుంటుండగా ఒక్కసారిగా కో తుల గుంపు అతడి మీద పడి గాయపరిచా యి. స్థానికులు వెంటనే మంచిర్యాల ప్రభు త్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతుల బారి నుండి తమను కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మనుస్మృతి పునర్ముద్రణ రద్దుచేయాలి

- దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు



నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: మనుస్మృతిని భారతదేశ రాజ్యాంగంగా ప్రకటించడానికి జరుగుతున్న కుట్రలను భారతీయులు వ్యతిరేకించాలని దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తిరస్కరించిన మనుస్మృతిని మళ్లీ ముద్రించి ప్రచారం నిర్వహించడానికి హైదరాబాద్‌లో ఫిబ్రవరి 11న ఆవిష్కరణ సభ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మనుస్మృతి ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉండడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పలిగిరి కనకరాజు, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్‌లు కనుకుట్ల మల్లయ్య, మోతే రామదాసు, దళిత ఫోరం నాయకులు ఐత పరమేశ్వర్, మానవ వికాస వేదిక నాయకులు మడిశెట్టి సత్యనారాయణ, గిరిజన ఐక్య వేదిక నాయకులు దిలీప్ రాథోడ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య ఉన్నారు.

సబ్సిడీ గొర్రెలు అందజేయాలి

భీమారం: అర్హత గల యాదవులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ గొర్రెల పథకాన్ని అందించాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో యాదవుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఉన్నా యాదవుల గురించి పట్టించుకోలేదని అన్నారు. సీఎం కేసీఆర్ యాదవులు ఆర్థికాభివృద్ధి చెందాలని రాష్ట్రంలోని అన్నీ గ్రామాల్లో గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఒకటి, రెండో విడతల్లో పేర్లు లేని వారికి, మూడో విడత కూడా అందించాలని తాము పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మెండె మల్లేశ్, మండల అధ్యక్షులు వేల్పుల పర్వతాలు, ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలిండియా గేమ్స్ పోటీల్లో తండ్రీకొడుకుల ప్రతిభ

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 2, 3, 4వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ పోటీల్లో తండ్రి, కొడుకులు ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానికుడైన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎంఏ డేవిడ్ ఫ్రాన్సిస్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనతో పాటు అతడి కుమారుడు అథ్లెటిక్స్ పోటీలో పతకాలు సాధించారు. ఎంఏ డేవిడ్ ఫ్రాన్సిస్ 75 సంవత్సరాల విభాగంలో లాంగ్ జంప్‌లో బంగారు పతకం, షార్ట్‌పుట్‌లో వెండి పతకం సాధించారు. ఆయన కుమారుడు ఎంఏ ప్రవీణ్‌కుమార్ 45ఏళ్ల విభాగంలో ఐదు కిలో మీటర్ల వాకింగ్‌లో వెండి పతకం సాధించాడు. త్వరలోనే జరిగే ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ పోటీలకు తండ్రి కొడుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.



47ఏళ్ల తరువాత ఒకేచోట..

జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1977 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్: ఆరు పదుల వయస్సు అందరిదీ... వివిధ వృత్తుల్లో పని చేసి కుటుంబ బాధ్యతలు తీర్చుకుని జీవితంలో స్థిరపడ్డారు. పిల్లల వివాహాలు చేసి, మనవలు, మనవరాళ్లతో సరదగా గడుపుతున్న తాతలు, అమ్మమ్మ, నానమ్మలు వీరు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 47ఏళ్ల తరువాత ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పలువురు భార్యా పిల్లలతో వచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. తొలుత లోకం విడిచిన గురువులు, మిత్రులకు సంతాపంగా మౌనం పాటించారు. చిన్ననాటి గురువులు కొముర‌య్య, సాంబయ్యలను శాలువలతో సన్మానించారు. పట్టణంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థి న్యాయవాది సంజయ్ వైరాగరే ఆధ్వర్యంలో వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు రావుల వినాయక్, తాటిపెల్లి ప్రమోద్, శిద్దం శెట్టి ఉమేశ్, బోనగిరి సతీశ్ బాబు, ఇరుకుల్ల ఆంజనేయులు, వారణాని కిషన్ రావు, సాంబయ్య, తుకారాం, మహమ్మద్, సంజయ్ వైరాగరే, వల్లపు ప్రేంసాగర్, చక్రపాణి, శివప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా శ్రీశారద శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 1994-1995లో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ ఆవరణలో జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి తమ బాల్యస్మృతులను గుర్తు చేసుకున్నారు. వారికి బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ ఇందులో ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, విజయ, సమ్మిరెడ్డి, విద్యార్థులు కూసి తిరుపతి, సంజీవ్ పాల్గొన్నారు.